# 11.

# రాతిని దేవుడిగా పూజించు - దేవుడిని రాయిగా చూడకు

దినయామిన్యౌ సాయంప్రాతః శిశిర వసంతౌ పునరాయాతః
కాలం క్రీడతిగచ్ఛత్యాయుః తదపి నముంచత్యాశావాయుః
రేయి పగళ్లూ సాయంప్రొద్దులు
చలి వేసవులూ సారెకు మారును
కాలక్రీడల గతిచే నాయువు
ఐనా వదలదు ఆశా వాయువు ॥భజగోవిందం॥
సత్యంజన విరోధాయ అసత్యం జనరంజనం
సురా విక్రేయతే స్థానే దద్యాదికం పీత్వా గృహే గృహే

దివ్యాత్మ స్వరూపులైన విద్యార్థులారా!

కాలము ప్రచండమారుతము వలె అతివేగముగా కదలిపోతున్నాది. ఆయువు మంచుగడ్డవలె క్షణక్షణమునకు కరిగిపోవుతున్నది. జీవితం యొక్క కర్తవ్యాన్ని మానవుడు గుర్తించలేక తాను కాయమును విడచి రాలిపోతున్నాడు. రాలిపోయిన ఈ కాయమును కాల్చి వేయటమో, పూడ్చివేయటమో జరుగుతున్నది. మానవజన్మ యొక్క విశిష్టత యింత మాత్రమేనా లేక ఈ పవిత్రమైన కాయము ధరించినందుకు ఏమైనా సార్థకమైన ప్రయత్నములలో మనకాలమును వినియోగము చేయటమా అనేది యోచనచేయాలి. మనము ఈ మానవత్వములో జన్మించి ఏ యొక్క పవిత్ర కార్యము నిమిత్తమై జన్మించామనే సత్యాన్ని మనము గుర్తించుకోలేని పరిస్థితిలో కేవలము కాలాన్ని వ్యర్థము చేయటము లేక అపవిత్రము చేయటము జరుగుతుంది. ఈ వ్యర్థ ప్రయత్నములకు కాలమే ప్రమాణమై ఉండుటచేత ఈ కాలమును మనము సక్రమమైన మార్గములో అనుభవించుకోటానికి తగిన ప్రయత్నాలు చేయటం మానవుని యొక్క కర్తవ్యం. కండబలము, గుండెబలము ఆధారము

sri sathyasai vachanamrutam

చేసుకొని జీవించటానికి పూనుకుంటున్నాడుగాని మానవుడు దైవబలమును ఏమాత్రముకూడను ఆశించటానికి గాని, అర్థించటానికిగాని ఏమాత్రము ప్రయత్నం సల్పటం లేదు. లోకములో అన్ని అగ్నులు ఆరటానికి ఒక కాలము నియమితమై ఉంటుంది. కొన్ని రకములైన అగ్నులు ఎంతకాలమైనను ఆరక మరింత ప్రజ్వరిల్లుతూ వుంటాయి. ఈనాడు మానవుని దేహమందు హృదయ స్థానములోపల కామాగ్ని, క్రోధాగ్ని, లోభాగ్ని, మోహాగ్ని ఈ నాల్గింటి యొక్క చేరికచేత హృదయము ధగ్ధమైపోవుచుండగా కూడను మానవుడు గుర్తించక, తన జీవితమును ఏమాత్రము అర్థము చేసుకొనక దేహము అనే గృహము ఏవిధమైన స్థితిలోపల క్షీణించి మసియై బొగ్గులుగా మారిపోతుందో అనే సత్యాన్ని కూడా మరచి, జీవించటానికి అనేక రకములైన ప్లానులు వేస్తుంటాడు. ఇంటిలో సర్పము చేరినప్పుడు తాను ఆ యింటిలో జీవించటానికి గాని, సంచరించటానికి గాని, నిద్రించటానికి గాని ఎట్టి మానవుడు ధైర్య సాహసములకు పూనుకోడు. ఆ చేరిన పామును పట్టియో లేక కొట్టియో దానిని వెలుపల పారవేసిన తదుపరే తనకు కొంతవరకు శాంతి ఏర్పడి ఆ గృహము నందు తాను నిర్భయంగా నివసించటానికి పూనుకోవటం సహజం. అయితే మన దేహమనే యింటిలో విషయవాంఛలనే విషసర్పములు చేరి పుట్టలు కట్టుకొని, అనేక రకములైన బిడ్డలను పెడుతూ అభివృద్ధి పరస్తుండే స్థితిలోపల, ఈ మానవుడు ఈ గృహములో శాంతిగా జీవించుతూ ఆనందముగా పండ్లికిలిస్తూ, తన భవిష్యత్తుకు అనేకరకములైన ప్లానులు వేయుచూ తాను యింత ధైర్యంగా వుంటున్నాడంటే యిది కేవలము తెలిసి ధైర్యమా లేక తెలియక ధైర్యమా ఆశ్చర్యంగా వుంటున్నది. జననము, జీవితము, పరిణామము లేక కొన్ని రకములైన క్షీణములు, నాశనములు అన్నియు కాలము చేత మనకు ప్రాప్తిస్తున్నాయి. కాలము వలననే పగలు వెనుక రాత్రి, రాత్రి వెనుక పగలు ఒకదానికొకటి వెంటాడుతూ వస్తున్నవి. భారత దేశమునకు పగలుగా ఉండినప్పుడు అమెరికా దేశములో రాత్రిగా ఉంటున్నాది. భూగోళములో అర్ధము రాత్రిగను, మిగిలినఅర్ధము పగలుగను మనకు గోచరిస్తున్నాది. ఈ భూమిలోపల అర్ధ భాగమే ద్వంద స్వరూపమును అనగా సగభాగంలో చీకటి, ఇంకోసగభాగంలో వెలుతురు ధరించి, మన జీవితమునకు గుణపాఠమును చెప్పుచుండగా, మన జీవితము మార్పులేనిదిగను మన

sri sathyasai vahini

జీవితము నిత్యమైనదిగను, మన జీవితము సత్యమైనదిగను మనము భావించు కోవటం వెఱ్ఱితనము. ఈ కాలము చేత జీవితమే మార్పు చెందుతున్నది. ఈ జీవితము మార్పు చెందుతున్నదా లేదా అన్న దానికి మన కాయమే దీనికి ప్రమాణము. బాల్యము, యవ్వనం, వార్ధక్యం యీ మూడు కాలముల వలననే ఈ స్వరూపాలు కొన్ని మార్పులు చెందుతున్నవి. కాలము అన్నది కాళికాదేవి. ఈ జీవితమనే వేదికపైన అతి చిత్ర విచిత్రమైన నృత్యమును కూడను సల్పుతున్నది యీ కాళి. ఈ నృత్యము సల్పుతున్న సమయమునందు మనకు తెలియకనే ఆయువు తరిగిపోతూ వస్తున్నది. గడచిపోయిన దానిని ఒక విధముగా చూచి అది గడచిపోయినది గడచిపోయినటువంటిది, ఉన్నటువంటి దానిని వర్తమానమని రాబోయేదానికి భవిష్యత్తు అని తెలుసుకోవాలి కానీ ఈ భవిష్యత్తు, వర్తమానము, గడచిపోయినది మనకు మనము చిత్రించుకొని ఈ భావములతో మన ముందు జీవితములో అనేకరకములైన జీవిత ఆదర్శాలను మనము నిరూపణ చేసుకోటానికి పూనుకుంటున్నాము. భూత, భవిష్యత్ వర్తమానములన్నీ కూడను కాలమార్పుచే కల్గినవేగాని ప్రత్యేకముగా సృష్టింపబడినవి కాదు. అయితే అట్టి కాలమును మనము ఏవిధముగానైనా గుర్తించుకొని ఆ కాలమును పవిత్రము చేసే ప్రయత్నానికి మనము పూనుకోవటమే ఒక ప్రధానమైన లక్ష్యము. దేహమును ప్రధానమైన లక్ష్యమునందు చూచుకొనక మనయొక్క కాలమును ప్రధానమైన దృష్టియందుంచుకొని కాలమును ఏరీతిగా గడిపినప్పుడు యీ కాయము పవిత్రమైన స్థితిని పొందుతుంది అనేటువంటి దానిని నిరూపణ చేయుటకు వచ్చినవే ఈ శాస్త్రములు, వేదవిహితమైన ధర్మములు. యక్ష ప్రశ్నలందు యముడు ధర్మజుని ఒక ప్రశ్న వేశాడు. 'నాయనా! ఏది సత్యమైనది, ఏది మార్పు అయినటువంటిది, ఏది కాలముతో జరుగునటువంటిది,' అని ప్రశ్నలు వేశాడు. అప్పుడు ధర్మరాజు చమత్కారంగా ఒక జవాబును చెప్పాడు. ఇది కేవలము భగవంతుని యొక్క పాకము అన్నాడు. బ్రహ్మాండమునే ఒక భాండముగా తీసుకున్నాడు. ఐతే ఈ పాకములు చేయటానికి కట్టెలు ఉండాలి, నిప్పు ఉండాలి, గరిటె ఉండాలి. అయితే ఈ కుండ బ్రహ్మాండముగా తీసుకొని ప్రాణులనే వారిని ఆ పాత్రలోపెట్టి, రాత్రింబవళ్లు అనే కట్టెలచేత, ఋతువులను గరిటగా తీసుకొని, ఆయుః ప్రమాణమనే హస్తమును తీసుకొని, ఆ

srisathyasaivahini.org

ప్రాణులను ఆ పాత్రలో అటూ యిటూ త్రిప్పుతున్నాడుట. తదుపరి ఈ జగత్తుయొక్క వింత ఏమిటి అని ప్రశ్నించినప్పుడు 'స్వామీ! గతించిన వారిని చూచి జీవించినటువంటి వారు ఏదో శాశ్వతంగా యీ ప్రపంచములో నిల్చివున్నామనే భ్రాంతిచేత జీవించిన వారు ఏడుస్తుండటము, యిది ప్రపంచము యొక్క వింత. కానీ, యిది సరియైనది కాదు. " కాలకాల ప్రపన్నానాం కాలః కిం కరిష్యతి" కాయమును, కాలము మ్రింగినప్పుడు, కాలమునే మ్రింగేవాడు నీవై యుండగా కాయమునకై వగచే జగత్తు, చాలా అజ్ఞానమయంగా వుంటుంది అని తాను జవాబు చెప్పాడు. కాలము చేతనే సర్వము మారటం, సర్వము లయము కావటం, సర్వము సృష్టింపబడటము. కనుక కాలము వలన సృష్టి, స్థితి, లయములు కలుగు చున్నవనే సత్యాన్ని మనం గుర్తించినప్పుడు కాలమును అలక్ష్యంగా అపవిత్ర పరచటము మనకు యే మాత్రము సరియైనది కానేరదు. అయితే గడచిపోయిన వసంతఋతువు తిరిగి రావచ్చును. క్షీణించిన చంద్రుని కాంతి తిరిగి ప్రకాశించ వచ్చును. కాని నదీజలము, నరుని యవ్వనము తిరిగి రావటానికి వీలుకాదు. కనుక, తిరిగి రాని యీ యవ్వనత్వాన్ని, తిరిగి వెనుకకు రానటువంటి ఈ జీవిత జలతత్వాన్ని మనము పవిత్రమైన మార్గములో ప్రయత్న పూర్వకముగా సార్థకము గావించుకోటానికి పూనుకోవటం అత్యవసరము.

**కాలమే అన్నింటికి ప్రధానము - ప్రమాణము**

మానవత్వము దివ్యత్వమైన దైవత్వాన్ని నిరూపణచేసే తత్త్వములో ఈనాడు మన భారత దేశము దైవత్వమునే విస్మరించి, కేవలము విషయ సంబంధమైన మార్గమునందు కాలమును అపవిత్రము చేయుటచేతనే, భారతదేశము అనాది వేదవిహితమైన కాలముగా లేక అనాది యొక్క స్థితిని మనం మర్చిపోవటం చేత మనము కూడను అనాథలమై అనేక రకములైన యిక్కట్లకు గురియై పడరాని బాధలను పడటానికి ఒకవిధమైన ఆదర్శంగా ఉంది. మనకు రానివి రాకపోవు. ఉన్నవి నిలబెట్టుకొనుటకు సాధ్యము కాదు. కాలమువల్లనే మనకు కష్టములుగాని, సుఖములుగాని, లాభముగాని, నష్టముగాని, మంచిగాని, చెడ్డగాని మనకు కలుగుతున్నవి.

**'పోకన్ మానదు దేహమెవ్విధముననన్ పోషించి రక్షించినన్,**
**రాకన్ మానవు హాని వృద్ధులు మహారణ్యంబుననన్ దాగినన్!**

sri sathyasai vachanamrutam

జన్మాంతర పుణ్యపాపములచేత లభించిన మానవతత్త్వానికి మనము అనేక ఊహలు పన్నుకొని దానిని తప్పించుకొనుటకుగాని, లేని దానిని తెప్పించు కొనుటకుగాని, ఉబ్బూతలూగుతున్నాము. ఇది కేవలము అజ్ఞానము యొక్క తత్త్వము. ధనముగాని, సుఖముగాని, దుఃఖముగాని మన పూర్వజన్మము యొక్క ఫలితమును పురస్కరించుకొనియే ఫలితము వెంటాడుతుంటుంది గాని ఎప్పటికప్పటికి మనకు మార్చుకోటానికి శక్తి కలదని విఱ్ఱ వీగటమనేది వెఱ్ఱితనమనే చెప్పవచ్చు. అయితే ఈరీతిగా మనకు ప్రాప్తిస్తుందని కొన్ని ఉదాహరణలు చెప్పవచ్చును. అనేక ప్రాంతములందు ధనవంతులను చూచి పెట్టి పుట్టినటువంటి వాడు అని చెబుతుంటారు. అనగా పూర్వ జన్మములో పెట్టటంచేత ఈనాడు ధనవంతుడుగా పుట్టాడు అని దీని అర్థము. పూర్వ జన్మమందు, దానమో, ధర్మమో, త్యాగమో యిట్టి పరోపకార సంబంధమైన కార్యములు ధనరూపకంగా త్యాగము చేసినవాడు ఈ జన్మలో ధనవంతుల యింట పుడుతుంటాడు అని కూడను దీనికి అర్థము. అయితే ధనహీనుల యింటియందు పుట్టి ధనవంతుల యింటికి దత్తత వెడుతుంటారు. ఇంతేకాక దరిద్రులుగాపుట్టి, కొంతకాలమునకు నిధి నిక్షేపములు ప్రాప్తించి వారు ధనవంతుడుగా తయారౌతుంటారు. అంతేకాక దరిద్రుడై కూడను విద్యావంతుడు కావటంచేత, ఏదో గొప్ప పదవులు, ఉద్యోగములలో చేరి తాను కట్టకడపటికి మహా ధనవంతుడుగా రూపొందుతుంటాడు. అంతేకాక, ఇప్పుడు ఆధునిక యుగమందు ఏదో ఒకవిధంగా, తనయొక్క పూర్వజన్మ ఫలితమును పురస్కరించుకొని లాటరీ టిక్కెట్లుకు లక్షలకు వచ్చి వారు ధనవంతులౌతుంటారు. ఈ అన్నింటికంటే ఎక్కువగా దైవానుగ్రహమునకు పాత్రుడై ఆ దైవానుగ్రహ ధనముచేత యిహపరములందు సిరిసంపదలతో తులతూగుచూ ఉండటం కూడను కద్దు. కాని యిట్టి ఆనంద సుఖములకంతా కూడను పూర్వజన్మ సుకృతమే దీనికి ఆధారముగాని మానవుని ప్రయత్నము యేమాత్రము కాదు. ఆపదల నన్నింటిని ఆనంద బిందువులుగా చూచుకొని, కన్నీరునే పన్నీరుగా మనం భావించటంచేత మన జీవితము సుఖశాంతిమైనదిగను, సౌభాగ్యమైనదిగను వర్ధిల్లుటకు అవకాశముంటుంది. మరణము కూడను అమృతత్వాన్ని అందించేటు వంటి మార్గముగా మనము విశ్వసించాలి. ఇది ద్వంద్వ ప్రకృతి. ద్వంద ప్రకృతి యందు అద్వైతమన్నది మనకు లభ్యము కావటానికి సాధ్యము కాదు. భావాద్వైతము



srisathyasaivachanamrutam

సిద్ధిస్తుంది గాని, క్రియాద్వైతముగాని, పదార్థాద్వైతముగాని మనకు ప్రాప్తించటం అసాధ్యం. ఒక చిన్న ఉదాహరణ. మనయొక్క వేలును మన నోటియందుంచుకున్నప్పుడే మన ఎంగిలి మనకు తగిలినదని నీరు పోసి కడుగు కోటానికి ప్రయత్నిస్తాము. మన హస్తమే మనకు విరుద్ధమైనప్పుడు ఇంక జగత్తు నందున్న వస్తువులు భేదము కాక అభేదములు ఏరీతిగా అవుతాయి. అయితే భావమును భగవత్తత్వమందుంచుకోవటం చేత దానిని భావాద్వైతమని చెప్పటానికి సాధ్యమవుతుంది. దీనికి మరొక ఉదాహరణము. ఒక గదియందు ఒక వ్యక్తి చేరి అనేక పదార్థములు వెతుకుచున్న సమయములోపల ఆ వ్యక్తికి అన్నియు కనిపించును గాని ఒక్క పదార్థము అతనికి కనిపించదు. అది ఏమిటి అని మనము విచారించినప్పుడు తన దృష్టి పదార్థములపైన పోవటం చేత పదార్థములనే తాను వెతుకుతున్నాడు గాని తనకు తాను మాత్రము కనిపించడు. అదేవిధముగా జగత్తు అనే యీ గదిలో ప్రవేశించి మనము సుఖము, సంతోషము, ఆనందము, సౌభాగ్యము, సౌశీల్యము అనే విషయ సంబంధమైన పదార్థములపైననే మన దృష్టిని ప్రసరించటం చేత తనను తాను మరచిపోతున్నాడు ఈ మానవుడు. ఈ పదార్థముల దృష్టి ఎప్పుడు మరల్చునో అప్పుడే పరార్థమైన యదార్థ స్వరూపము తాను గుర్తించుకోటానికి వీలవుతుంది. బుద్ధి ఒక టార్చిలైటు వంటిది. ఈ టార్చిలైటు వేసున్నంతసేపు బయట రోడ్డుగాని, వ్యక్తులు గాని మనకు గోచరిస్తారుగాని మనకు మనం కనిపించం. కాని, ఆ టార్చిని తనవైపు మరల్చుకున్నప్పుడే తన స్వరూపము చక్కగా గోచరిస్తుంది. భగవంతుడు శుద్ధమైన అద్దము వంటి బుద్ధిని మనకు అందించినప్పుడు ఈ అద్దముతో మన స్వరూపాన్ని మనము సందర్శించక ఈ అద్దము తీసుకొని వెళ్ళి పరుల ముఖము ముందుపెట్టి తాను కిలకిల నవ్వుతున్నాడు. నీ ముఖమును నీవు చూచుకోవటానికి పరుల ముఖము ముందు పెడితే నీ ముఖము ఎలా కనిపిస్తుంది? కనుక, నిన్ను నీవు సందర్శించుకోవాలి, ఆత్మసాక్షాత్కారం కావాలి అనుకున్నప్పుడు ఆ బుద్ధి అనే అద్దమును నీ ముఖము ముందు పెట్టుకునే ప్రయత్నము చేయాలి. లేనిదానిని సంపాయించటం కాదు, ఉన్నదానినే సద్వినియోగం పరచుకునే విధానాన్ని మనము తెలుసుకోవాలి. ఈ అద్దము ఉన్నది. అది మనవైపు ఉపయోగపెట్టవలసిన విధానము తెలుసుకొనలేక దానిని ప్రపంచము వైపు పెట్టి మనము కనిపించలేదేయని వగస్తూ

ఉన్నాము. కనుక, భజగోవిందమునందు కాలమును పవిత్రము చేసి, కాయమును తన వైపునకు త్రిప్పుకొని "కాలకాల ప్రపన్నానాం కాలః కింకరిష్యతి" అనేటువంటి అర్థమును మనము స్మరించుకొని కాలస్వరూపుడు, కాలనియమితుడు కాలమునకు అధికారి అనే తత్వాన్ని అర్థం చేసుకోవటం నిమిత్తమై ఈ శ్లోకాన్ని శంకరులవారు అందించారు.

రామకృష్ణపరమహంస తెల్లవారినది మొదలు రాత్రి పరుండునంతవరకు దేవీ సందర్శన నిమిత్తమై క్షణక్షణము లెక్కించుచూ పోతుండేవాడు. రాత్రి నేను వ్యర్థపరచితిని, నేడు కూడను నీ సందర్శనము లభించకపోయెనా అని కంటి ధారలతో కాలమును వృథాపరచితినేయని వగచుచూ తాను పండుకొనుటకు ప్రయత్నించేవాడు. కనుక, కాలమును వృథాపరచుటచేత మహనీయులు ఎంత కంటినీరు కార్చిరో యువకులైన మీరు అర్థము చేసుకోవాలి. అట్టి పవిత్రకాంతి నిమిత్తమై కాయమును కూడను పుట్టలుగా కట్టుకునే ప్రయత్నానికి పూనుకొని తమ దేహమును త్యాగముచేసి, ఆ కాలస్వరూపుని నిమిత్తమై కాచుకునేవారు. కనుక మనము కాలమును వృథాపరచకుండా కాయముతో సత్కర్మలు ఆచరించి పరులను సంతోషపెట్టే మార్గమునందు మన జీవితాన్ని ప్రవేశపెట్టాలి. ఈనాడు యువకులు కాలమును వృథా పరిచేదాంట్లో మహా ప్రవీణులుగా కనిపిస్తున్నారు. అనవసరమైన విషయములను గంటలకొలదీ మాట్లాడుతూ కూర్చుంటారు. ఏమీ పనిలేకపోతే పిచ్చి పిచ్చి బుక్కులంతా చదువుతూ కాలమును పాపపు రూపము లోపల తాను అందుకుంటూ వుంటాడు. కనుక, మన నిత్యజీవితమునకు ఉపయోగపడని ఎట్టి కర్మలైనా కూడను కాలమును అపవిత్రము చేసిన వారమే అయిపోతాము. నీకు ఎట్టి పనులూ లేకపోయినప్పుడు సద్గ్రంథములు చదువుతూ కూర్చో. మన భారతీయ సంస్కృతికి పునాది స్వరూపములైన భారత, భాగవత, రామాయణ యితిహాస పురాణ భగవద్గీత యిత్యాది గ్రంథాల్ని నీవు పఠించటానికి పూనుకో.

**గుణములను పవిత్రముగా ఉంచుకో!**

మనసు ఒక కెమెరా లెన్సువంటిది. నీవు ఈ మనస్సును ఎట్టి అపవిత్రమైన కథలమీద ప్రవేశపెడతావో ఆ అపవిత్రత నీ హృదయమనే ప్లేటు పైన చిత్రించిపోతుంది. లేక

యితరులయొక్క చెడ్డనుగాని, యితరులయొక్క అపవిత్రతనుగాని మనము చింతించుచు రావటంచేత మన చిత్తము కూడను అపవిత్రములో లీనమైపోతుంది. కనుక నీవు మంచిని చింతించి, మంచిని దర్శించి, మంచి పలుకులు శ్రవణము చేసి మంచి కార్యములందు పాల్గొని, నీ చిత్తమును నీ భావమును మంచిగా, పరిశుద్ధమైనదిగా, పవిత్రమైనదిగా మార్చుకోటానికి ప్రయత్నం చేయవచ్చు. కనుక, దృష్టిదోషం శ్రవణదోషం, వాగ్దోషం, మనస్స్దోషం, క్రియాదోషం ఈ పంచదోషములయందు నీవు యే మాత్రము ప్రవేశించకుండా వుండిన పరమాత్ముడు అక్కడనే ప్రత్యక్షమవుతాడు. కనుక, గుణదోషమువలననే పరమాత్ముడు అతిదూరముగా ఉన్నట్లు కనిపిస్తున్నాడు. గుణములు పవిత్రపరచినప్పుడు పరమాత్ముడు నీ స్వరూపము లోపలనే సాక్షాత్కరిస్తాడు. అద్వైతమనేది నీవూ నేను ఒక్కటే అనేది సుందరం ఈనాడు మీకు తెలిపిన విషయంలోపల ఎప్పుడు మనం ఒకటవుదాం. I and you are one అంటాము మనము. I and you are two not one. I and I are one. You and you are one. అంతేగానీ I and you are one అనటం కేవలం ఒక భ్రాంతిగానీ అది సరియైనది కాదు. అందువలననే ఒక చిన్న కథ. ఒక గురువు దగ్గర శిష్యుడు ఉన్నాడు. ఆ గురువు ఆనాడు ఏదో ఈ విధమైన ప్రసంగములందు 'గురుబ్రహ్మ శిష్య బ్రహ్మ సర్వం బ్రహ్మ' అన్నాడు. సర్వం బ్రహ్మమయంజగత్ అనే భావముతో ఆ గురువు ప్రబోధించాడు. నిత్యము గురువు దగ్గరకు వచ్చి శిష్యుడు 'నమస్కారము' అని చెప్పేవాడు. ఈ ప్రబోధను విన్నప్పుడు గురువు వచ్చినప్పుడు లేవలేదు, అతనికి తగిన గౌరవము యివ్వలేదు, నమస్కారం చేయలేదు. అప్పుడు 'ఏమిటి నాయనా! నీ ప్రవర్తన వింతగానున్నదే అని గురువు ప్రశ్నించాడు. 'నాలో ఏ వింత ఉన్నది' అన్నాడు శిష్యుడు. 'నిత్యము నమస్కారము చేసి యేదో గౌరవముగా ప్రవర్తించేవాడవు ఈనాడు ఏదో అగౌరవంగా, అలక్ష్యముగా కూర్చున్నావు ఎందుకు? అడిగాడు గురువు. 'స్వామి సర్వం బ్రహ్మమయం అని చెప్పారు కదా. యింక గురువు ఏమిటి శిష్యుడు ఏమిటి? గురుబ్రహ్మ, శిష్యబ్రహ్మ' అన్నాడు తాను. అప్పుడు ఈ ప్రబోధ నాకే ఒకవిధముగా ఎదురు తిరిగిందనుకొని ఒక బోర్డు తీసుకొని గురుబ్రహ్మ అని వ్రాసాడు. గురువు ఒక దగ్గర, బ్రహ్మ ఒక దగ్గర. గురుబ్రహ్మ, శిష్యబ్రహ్మ, సర్వం బ్రహ్మ అని వ్రాసాడు. అయితే బ్రహ్మ ఒకటే అయింది గాని గురు, బ్రహ్మ శిష్య వేరుగా మారిపోయాయి.

srisathyasaivachanamrutam

గురు

శిష్య బ్రహ్మ

సర్వం

అయితే గురు, శిష్య, సర్వం మూడు ఒక్కటైనప్పుడు సర్వం బ్రహ్మ అనవచ్చును గాని యిక గురుశిష్యులకు భేదమున్నప్పుడు బ్రహ్మతత్వాన్ని ఏరీతిగా చెప్పగలవు? కనుక, మనకు అనుభవంలో సర్వంబ్రహ్మ అని అనుభూతికి వచ్చిన తరువాత నీవు ఒకరికి నమస్కరించనక్కరలేదు, ఒకరికి గౌరవము నివ్వనక్కరలేదు. ప్రత్యేకంగా నీవు జీవించనక్కరలేదు. అయితే అట్టి స్థితి మనము పొందేంతవరకు నీవు శిష్యుడవే, తాను గురువే. గురువుకు తగిన శిష్యత్వాన్ని మనము అందించక తప్పదు, సేవించక తప్పదు. ఆధారము ఒక్కటేగానీ ఆధేయము భిన్నము. దీనికి మరొక చిన్న ఉదాహరణము. ఒక కొండలో ఒక గుండు ఉంది. ఆ గుండుపైన ఒక శిల్పి కూర్చుని కృష్ణుని రూపము తయారుచేశాడు. కానీ కృష్ణ విగ్రహాన్ని మాత్రమే తీసుకొనివెళ్లి ఒక మండపము కట్టి అందులో ప్రతిష్ఠచేసి ధూపదీప నైవేద్యములతో ఆరాధన సలుపుతూ వచ్చాడు. అయితే ఆ కొండ లోపల కృష్ణుడు అయిన తరువాత ఆ ముక్కలుగా మిగిలిన రాళ్లు ఆ కొండలోనే పడినవి. ఆ రాళ్లు చెబుతున్నాయి, 'తత్ త్వం అసి' ఆ ప్రతిష్ఠ అయిన కృష్ణుడు, ఆ ధూప దీప నైవేద్యములు అందుకుంటున్న కృష్ణుడు మాలోని ఒక భాగమే అని చెప్పవచ్చునే గాని ఈ ముక్కలకు పూజలు లేవు కదా! ఈ స్వరూపమునకే పూజలు అక్కడ స్వతఃసిద్ధముగా ఏర్పడుతున్నాయి. అనగా ఈ లక్ష్యార్థమును తీసుకున్నప్పుడు ఆ కృష్ణుడు యీ ముక్కలు రెండు ఒక్కటే. కాని బాహ్యార్థముతో ఒక స్వరూపాన్ని సందర్శించుకునే లోపల ఈ మిగిలిన రాతి ముక్కలకు యేమాత్రము గౌరవము యివ్వటానికి వీలు కాదు. ఈ స్వస్వరూపకంగా తయారైన దానికి మాత్రమే మనము నమస్కరించటానికి ఒక విధమైన భావము ఉప్పొంగుతుంది. ఇదే ప్రకృతికి, పురుషునికి ఉన్న సంబంధము. అయితే ప్రకృతి వేరు, పురుషుడు వేరు. ఎప్పుడు ప్రకృతి పురుషుడు లీనమౌతారనగా ప్రకృతి పురుషుల తత్త్వములో ఒక లీనత్వము కలిగినప్పుడే ఏకత్వమనేది ప్రాప్తిస్తుందిగాని రెండూ విడివిడిగా ఉండినప్పుడు మాత్రము అది అద్వైతమని చెప్పటానికి సాధ్యము కాదు. ప్రకృతి స్థానమునుంచి పురుష స్థానమునకు మనము కొనిపోయినప్పుడే అప్పుడు ఈ ప్రకృతి పురుషత్వములో చేరిపోవటం చేత ఒక్కపేరు మాత్రమే నిలుస్తుంది, ప్రకృతి, పురుషుడు అని

sri sathyasai vahini vachanamrutam

ఉండదు. పురుషుడు మాత్రమే నిలుస్తుంది.

**సర్వం ఈశ్వరత్వమనే విశాలమైన భావము భారతీయులది**

ఈనాడు ప్రకృతిని పురుషుని దగ్గరకు తీసుకుపోవటానికి ప్రయత్నం చేయటం లేదు. You may worship a picture as God but not God as a picture. ఈ రాయి దేవుడు, ఈ పేపరు దేవుడు, ఈ పెళ్ల దేవుడు, ఈ మట్టి దేవుడు అని నీవు మట్టిని కూడను దేవుని స్థితికి తీసుకువెళ్లు. రాయిని కూడను దేవుని స్థితికి తీసుకు వెళ్లు, పిక్చరును దేవుని దగ్గరకు తీసుకువెళ్లు అంతేకాని దేవుడు రాయి, దేవుడు పేపరు, దేవుడు మట్టి అని దేవుని క్రిందకు దింపవద్దు. మన భారతీయ సంస్కృతి యందు ఈశ్వర స్సర్వభూతానాం అన్నారు. సర్వభూతములయందు దైవత్వమున్నదని చెప్పటములోపల రాయి కూడను దేవుడే అని భారతీయుల యొక్క ప్రమాణముగాని దేవుడు రాయి అని చెప్పటం కాదు. కనుక, అనేకమంది పాశ్చాత్యులంతా ఏమి దేవుని రాయిగా పెట్టి పూజిస్తున్నారే, దేవుని picture గా పెట్టి పూజిస్తున్నారే అని వారు హాస్యాస్పదముగా చూస్తున్నారు. కాని దేవుని రాయిగా పెట్టి పూజించటం కాదు. రాయిని కూడా దేవునిగా చూస్తున్నాం. వృక్షాన్ని దేవునిగా పూజిస్తున్నాము. పశువుని దేవునిగా పూజిస్తున్నాము. విష స్వరూపమైన సర్పమును కూడా దేవునిగా పూజిస్తున్నాము. కనుక సర్వం ఈశ్వరత్వమనే విశాలమైన భావము భారతీయులది. తులసిమొక్కను దైవస్వరూపముతో ఆరాధన చేస్తున్నారు స్త్రీలు. గోవును దైవస్వరూపముతో ఆరాధన చేస్తున్నారు స్త్రీలు. ఇంతేకాదు అశ్వద్ధ వృక్షమును ఆరాధన చేస్తున్నారు మన భారతీయులు. సింహమును కూడను ఆరాదధన చేస్తున్నారు భారతీయులు. పులిని కూడా ఆరాధన చేస్తున్నారు భారతీయులు. భారతీయులు సర్వజీవులయందు దైవత్వమున్నాడనే భావముతో భారతీయులు ఆరాధన చేస్తున్నారే గాని గుడ్డి నమ్మకముతో కాదని మనం అర్థం చేసుకోవాలి.

కాన, భారతీయ సంస్కృతి మహా పవిత్రమైన అంతరార్థాన్ని అందించేటటు వంటిదే కాని, యితరులు అనుకుంటున్నట్లుగా భారతీయులు అజ్ఞాన మార్గములో ప్రవేశిస్తున్నారనే దానికి భారతీయులు ఏమాత్రము తల వంచనక్కరలేదు. భారతీయులు పవిత్రమైన చరిత్రలు ఎంత చెప్పినను తనివి తీరనిది, అంతరార్థము అఖండమైన స్వరూపముతోనున్నది కనుక మన భారతీయ యువకులు భారత భాగవత యితిహాస పురాణముల ప్రమాణములను ఉపనిషత్తులను, అనుభవజ్ఞులైన మహాపురుషుల జీవిత చరిత్రలను కూడను మీరు



srisathyasaivachanamrutam

గుర్తించుకొని, వాటిని మీరు అనుసరించటానికి కొంతవరకు పూనుకోవాలని యీ సమ్మర్ క్లాసులు ప్రారంభించారు.

విద్యార్థులారా! రేపటిదినము వేరే కార్యక్రమము ఉండటంచేత నేను మణిపాల్ వెళ్లవలసి వచ్చింది. రేపు రెండుగంటలకు ప్లేనులో పోయి ఎల్లుండి తిరిగి వస్తాను. ప్రతి దినము స్వామి వుండినటువంటి సమయములోపల ఏ రీతిగా ప్రవర్తిస్తున్నారో ఏరీతిగా మీరు కార్యక్రమములో పాల్గొంటున్నారో ఏరీతిగా మీ డిసిప్లిన్ అనుభవిస్తున్నారో అదేవిధముగా స్వామి మా వెంటనే జంటనే వుంటున్నాడనే భావముతో రేపటి దినము మీ క్రమశిక్షణ యేమాత్రము ఉల్లంఘించక మీ హృదయమునకు ఏమాత్రము నిరుత్సాహమునందుంచక స్వామి వుండినపుడు ఎట్టి ఉత్సాహాన్ని, ఎట్టి ఆనందాన్ని మీరు అనుభవిస్తూ మీరు క్రమశిక్షణను పాటించారో అదేవిధముగానే రేపటిదినముగాని, యింక ఏనాటికైనా గాని మీరు ఈ క్రమశిక్షణ పాటిస్తూ ఆనందంగా రేపటి కార్యక్రమాన్ని సక్రమంగా కొనసాగించుకొని మీ హృదయాలతో ఎదురు చూస్తుంటారని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

రేపటి దినము 2 గంటలకు నేను మణిపాల్ వెడుతున్నాను. రేపటి దినమునకు T.A. పాయ్ రైల్వే మినిష్టరు యిక్కడికి వస్తున్నాడు. ఆయనతోనే నేను మణిపాల్ వెడుతున్నాను. అక్కడ కృష్ణమందిరము ఒకటి కట్టారు. మణిపాల్ మెడికల్ కాలేజీ లోపల యీ మందిరము ప్రతిష్ఠ చేయటానికి నేను ఒప్పుకున్నాను. కారణమేమనగా విద్యార్థులు ఈ పవిత్రమైన ఆధ్యాత్మిక మార్గములో ప్రవేశించటము నాకు అత్యంత ఆనందము. నా ఆశయము కూడను అదియే. అందు నిమిత్తమై మణిపాల్‌లో మెడికల్ కాలేజి పేరు పొందినది. అట్టి మెడికల్ కాలేజీలో నేను కృష్ణమందిరమును ప్రారంభించి వారి హృదయ మందిరాల యందు కృష్ణుని ప్రతిష్ఠ చేసేటువంటి ఉత్సాహములో నేను ఈ కార్యానికి ఒప్పుకున్నాను. కనుక రేపటి దినము మణిపాల్ పోయి ఎల్లుండి 2 గం॥లకు నేను యిక్కడికి వచ్చి చేరుతున్నాను.

**(తేదీ 29-05-1973 న బృందావనంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasaivachanamrutam